ఈరోజు (25 మార్చి) విలేఖర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ(యం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు. ఆ వివరాలను ప్రచురణార్థం విడుదల చేస్తున్నాం. –జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

## ఎపిపై కేంద్రం కక్ష సాధింపు

**– ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గనాలి**

**– సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి.మధు పిలుపు**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎపిపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి.మధు అన్నారు. విజయవాడ ఎంబి విజ్ఞానకేంద్రంలో పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు(వైవి)తో కలిసి మధు విలేకరుల సమావేశంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర మంత్రుల మాట తీరు చూస్తుంటే ఎపిపై వివక్ష చూపుతున్నట్లు స్పష్టమవుతుందని తెలిపారు. రాష్ట్ర విభజన హామీల్లో పేర్కొన్న ప్రత్యేకహోదా, రైల్వేజోన్, యూనివర్శిటీలు, విద్యాసంస్థలు, పెట్రోకెమికల్ కర్మాగారాలు వగైరా ఇవ్వాల్సిన కేంద్రం వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. ప్రత్యేకహోదాపై పార్లమెంటులో మన రాష్ట్ర ఎంపిలు కేంద్రాన్ని అడిగితే హోదా గడిచిపోయిన అంశం అని కేంద్ర మంత్రులు సమాధానాలిస్తున్నారని మండిపడ్డారు. ఎపికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కును సైతం ప్రైవేటీకరణ చేస్తోందని, దాని వల్ల వచ్చే ఆదాయం కేంద్రానికే చెందుతుందని నిస్సిగ్గుగా కేంద్ర మంత్రులు పార్లమెంటులో చెప్పడం శోచనీయమని అన్నారు. అబద్దాలు, బుకాయింపులతో కేంద్రం పరిపాలన చేస్తోందని, ఎపి విషయంలో కుంటిసాకులతో కాలం వెళ్లబుచ్చుతోందని తెలిపారు. రాష్ట్రానికి అడుగడుగునా అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలంతా 26న జరిగే దేశవ్యాప్త బంద్‌లో పాల్గని నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిందని, బిజెపి మినహా ఇతర రాజకీయ పార్టీలన్నీ బంద్‌కు మద్దతు తెలిపాయని, ఇది శుభపరిణామమని అన్నారు. పార్లమెంటులోనూ భూగర్భఖనిజాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం వైఖరిని ఎపి ఎంపిలు వాకౌట్ చేసి నిరసన తెలిపారని ఇది మరో శుభపరిణామమని పేర్కొన్నారు. దేశంలోని రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలందరికీ అన్యాయం చేస్తున్న కేంద్రం వైఖరిని ప్రజలంతా అర్థం చేసుకుని బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గనాలని పిలుపునిచ్చారు. తిరుపతి ఉప ఎన్నికల్లో బిజెపికి రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని అన్నారు. బంద్ చేస్తున్నా పట్టనట్టు నటిస్తున్న కేంద్రం మరో రెండు, మూడు బంద్‌లతో తలంచక తప్పదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలపై ఇసుక భారంగా మారుతోందని, ట్రాక్టర్ ఇసుక రూ.4వేలు నుండి రూ.5వేలు పెట్టాల్సివస్తోందని, గతంలో రూ.1,500లకు వచ్చేదని గుర్తుచేశారు. నిత్యావసరాల ధరలు, ఇసుక ధరలు తగ్గించి ప్రజారంజక పాలన చేయాలని కోరారు.

= = = =